# 'శేషన్'

శేషంద్రకు నోబల్ ప్రతిపాదన

తెలుగు కవితకు నీరాజనం...

తెలుగు అక్షరం కొత్త వెలుగు చూసింది...

ఎర్రటి ఎండకు కాలి తపించిన మృత్తికపై చల్లని చినుకు...

ఎంత పరిమళం!

సరిగ్గా మూడు దశాబ్దాల క్రితం నేను చూసిన కొత్త కవిత శేషేంద్ర.

డిగ్రీలో వున్నా. కర్నూలు జిల్లా తెలుగు రచయితల సంఘం (కజితెరసం) పెట్టి... అప్పటికే ఓ కవితా సంకలనం ('సంచలనం') వేసాము.

శేషేంద్ర కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు.

అప్పట్లో వారి బస పోలీస్ కంట్రోల్ రూం వెనక... శేషేంద్ర కమిషనర్గా కంటే కవిగానే కర్నూలు వచ్చారనిపించింది. మా కాలేజీ సాంస్కృతిక వ్యవహారాల కార్యదర్శి 'చిరంజీవి' (సాబిర్...ఇతనెక్కడున్నాడో యిప్పుడు?) శేషేంద్రను కాలేజీకి ఆహ్వానించాడు. అప్పటికి శేషేంద్ర 'సొహరాబు రుస్తుం' కాక 'శేష జ్యోత్స్న', 'రక్తరేఖ', 'మండేసూర్యుడు' ప్రచురించారనుకుంటాను.

నేను తొలుత చదివింది మాత్రం 'శేషజ్యోత్స్న'...దానికి ముందు మాటగా "నేనూ – నా నెమిలి...నెమిలీ నా నేను" అని రాసారు. ఆ ముందుమాట చదవగానే నాకు దాంతే Devine Comedy స్ఫురణకు వచ్చింది. అలా ఆయన అభిమానిగా మారిపోయాను.

* * *

చాలా ఏళ్ల తరువాత నేను రచయితగా పరిణామం చెంది...ఇదే ఆంధ్రప్రభలో నా నవల "నేనూ–చీకటి" ప్రచురించిన తర్వాత నా ప్రియమిత్రుడు బాష (షౌకత్‌అలీ) దాన్ని పుస్తక రూపంలో తీసుకొస్తూ 'ముందుమాట ఎవర్తోటి రాయించాలిరా?' అనడిగాడు. అప్రయత్నంగా శేషేంద్రం అనేశాను. వాడు సరేనని...సీరియల్‌గా వచ్చిన చిత్తుప్రతిని తీసుకొని శేషేంద్రగారి భవనానికి వెళ్లాడు. ఆయన చిత్తుప్రతిని తీసుకుని... "నేను చదివి వ్రాయాలనిపిస్తే వ్రాస్తాను" అన్నారట. మరుసటిరోజు నేను వెళ్ళి ఆయన పాదాలు నమస్కరిస్తే... ఆయన నన్ను నిలువెల్లా చూసి...

"మీరు నఖశిఖపర్యంతం కవే" అన్నారు. ఒళ్లు గగుర్పొడిచింది.

ఆ తర్వాత ఓ పదిహేను రోజులకు ఫోన్చేసా...ముందుమాట గురించి.

'రాసాను వచ్చి పట్టుకెళ్ళండి' అన్నారాయన.

ఏం రాసారో ఎలా రాసారో..అని జంకుతూ వెళ్లాను.

ఆ రాజప్రసాదంలో కడుగుపెడుతూనే ఎదురొచ్చి సాదరంగా ఆహ్వానించారు.

"మిమ్మల్ని ఒక్కసారి కౌగిలించుకోనివ్వండి" అని నిండుగా కౌగిలించు కున్నాడు.

ఆ తర్వాత ఆయన వ్రాసిన ముందుమాట ఆ సాంతం చదివి వినిపించారు. ఇంతలో వారి సతీమణి శ్రీమతి ఇందిరాధన్‌రాజ్‌గిరి లోపలికెళ్లి ఓ శాలువా తెచ్చారు.

ఆ శాలువాను నా భుజం చుట్టూ కప్పి నన్ను సత్కరించారు శేషేంద్ర. ఆ సత్కారం నేను పొందిన అపూర్వ సత్కారం. అందుకు సాక్షులు మిత్రుడు మౌళి, శ్రీమతి ఇందిరా ధన్‌రాజ్‌గిర్... వారి నౌకర్లు ఇద్దరు.

శేషేంద్రగారి బల్లమీద పాలరాతి ప్రతిమలు...

కళ్లనిండా నీళ్లు పొంగాయి. ఓ అయిదు నిమిషాలపాటు ఏకధారగా ఏడిచాను. ఆ మహాకవి ఆశీసులతో ఈనాడు కొద్దోగొప్పో పేరు తెచ్చుకున్న రచయితగా మిగిలాను. ఆ శేషేంద్రకు ప్రపంచంలో అత్యుత్తమంగా భావించే నోబల్ ప్రతిపాదన ఎప్పుడో జరగాల్సింది... అసలు రావాల్సింది...

'అక్షరాల ఇసుకతో కవిత కట్టలేరు
తలపుల నెత్తావులు చిమ్మే మృదు హృదయ
సుమధూళి కావాలి...
జీవన మధూళితో తడపాలి
చెరకు విల్లు విరిచివాడే
చిగురుకైత చెబుతాడు
యెదల పొదరిళ్ల మీద మల్లెలు విరియిస్తాడు'

అంటూ ఆయన చెప్పిన తన లక్షణం...లక్షణంగా కవికుండాల్సిందే.... ●